నమస్తే తెలంగాణ
కామారెడ్డి
8 | నిజామాబాద్, ఆదివారం 11 మే 2025 | KAMAREDDY

**ఉమ్మడి జిల్లావాసులను** ఎన్నో ఏండ్లుగా ఊరిస్తున్న జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్టు నిర్మాణం కలగానే మిగిలిపోనున్నదా.. తాజా పరిస్థితులు అందుకు బలాన్ని చేకూరుస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం, కాంగ్రెస్ ప్రభుత్వం పట్టింపులేని తనంతో కథ మళ్లీ మొదటికి వచ్చినట్లే కనిపిస్తోంది. ఎయిర్‌పోర్టుపై ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారింది. వరంగల్ జిల్లాలోని మామునూరు ఎయిర్‌పోర్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన తర్వాత నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్టు ఏర్పాటుపై ప్రజల్లో ఆశలు చిగురించాయి. వరంగల్‌కు దీటుగా అనేక అనుకూలతలు నిజామాబాద్ జిల్లాకు ఉండడంతో విమానాశ్రయం తథ్యమనే సంకేతాలు వినిపించాయి. కానీ పరిస్థితులు ఇప్పుడు తలకిందులైనట్లుగా కనిపిస్తున్నది.

–నిజామాబాద్, మే 10 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)




# కలగా.. విమానయానం

## 'ఎయిర్‌పోర్ట్'పై ఆశలు ఆవిరి

- కాగితాలకే పరిమితమైన కార్యాచరణ
- అడుగడుగునా ప్రతికూల పరిస్థితులు
- చొరవ చూపడంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం
- కీలకంగా మారిన ఎయిర్‌పోర్ట్ అథారిటీ నివేదిక
- మూడు రోజుల పాటు క్షేత్ర స్థాయిలో అధ్యయనం
- నోరు విప్పని ఉత్తర తెలంగాణ బీజేపీ ఎంపీలు

**జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్టు** విషయంలో ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి నిపుణుల బృందం ఇచ్చిన నివేదిక ఇప్పుడు తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తున్నది. జక్రాన్‌పల్లి, ఆదిలాబాద్, బసంత్‌నగర్‌లో విమానాశ్రయాల ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు అందడంతో గత నెల 23, 24, 25వ తేదీల్లో ముగ్గురు సభ్యుల సాంకేతిక నిపుణుల బృందం క్షేత్ర స్థాయిలో ఎయిర్‌పోర్ట్ అవకాశాలపై అధ్యయనం చేసి నివేదికను రూపొందించింది. ఇందులో జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్ట్ ప్రతిపాదిత స్థలంలో జలాశయం ఉండడాన్ని బృందం గుర్తించింది. సమీప భూముల్లో విద్యుత్ స్తంభాలు, పొలాలు సాగు చేస్తుండడాన్ని, ఓ మతానికి చెందిన ప్రార్థన ప్రదేశం కూడా ఉన్నదని అందులో పేర్కొనడంతో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు పచ్చజెండా వస్తుందా? రాదా? అన్నది డైలమాలో పడింది. ఎయిర్‌పోర్ట్ కోసం భూమిని సేకరించడంలో సరైన సన్నద్ధత రాష్ట్ర ప్రభుత్వంలో కనిపించలేదని నిపుణులు తేల్చినట్లు తెలుస్తోంది.



### బీఆర్ఎస్ హయాంలో గ్రీన్‌ఫీల్డ్‌కు అంగీకారం

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జక్రాన్‌పల్లి వద్ద గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ లభించింది. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం పరిధిలోని జక్రాన్‌పల్లి మండలం తొర్లికొండ, కొలిప్యాక, అర్గుల్, మనోహరాబాద్, జక్రాన్‌పల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలోని 1663.05 ఎకరాల్లో ఎయిర్‌పోర్టు నిర్మాణం చేపట్టేలా సర్వే చేశారు. ఇందులో 816.4 ఎకరాలు మాత్రమే ఉపయోగపడుతుందని గతంలోనే ఏఏఐ పేర్కొంది. 1663.05 ఎకరాలకు మరో 68 ఎకరాలు భూమి అవసరం ఉంటుందని నివేదికలో తెలిపింది. ఇందులో మొదటి దశలో విమానాశ్రయం నిర్మాణం కోసం రూ.321 కోట్లు అంచనా వ్యయంగా నివేదికలో పేర్కొన్నారు.

### అడ్డంకి ఏమిటో...?

బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు తెలంగాణ రాష్ట్రంలో మొత్తం ఆరు చోట్ల విమానాశ్రయాలకు ప్రతిపాదనలు ఉండగా ఏఏఐ ఇచ్చిన నివేదికలో మూడింటికి మాత్రమే అనుమతి లభించింది. రాష్ట్రంలో వరంగల్ జిల్లా మామునూర్, ఆదిలాబాద్, పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్‌లలో బ్రౌన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టులు, అదే విధంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లిలో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టులు నిర్మించేందుకు ప్రతిపాదనలు రూపొందించారు. అయితే వీటిలో మామునూర్, ఆదిలాబాద్ బ్రౌన్‌ఫీల్డ్ విమానాశ్రయాలు, గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాల్లో జక్రాన్‌పల్లికి పచ్చజెండా లభించింది. 2021 జులై 23న నల్లగొండ ఎంపీగా ఉన్న ఉత్తమ్‌కుమార్ రెడ్డి పార్లమెంట్‌లో అడిగిన ప్రశ్నకు పౌరవిమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా బదులిస్తూ తెలంగాణలో విమానాశ్రయాల ఏర్పాటు ప్రక్రియ నడుస్తోందన్నారు. 2023, డిసెంబర్ 7న కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. 17నెలల పాలనలో మామునూరు ఎయిర్‌పోర్టుకు అనుమతులు లభించాయి. ఈ ఘనత వెనుక కేసీఆర్ సర్కారు కృషి ఎంతగానో దాగి ఉన్నది. ప్రస్తుతం జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్టు అంశం అటకెక్కినట్లుగానే కనిపిస్తోంది. ఏఏఐ బృందం అధ్యయనం చేసి తాజాగా నివేదిక సమర్పించగా అందులో ప్రతికూలతలపై పలు అంశాలను జోడించడం అనుమానాలకు తావిస్తోంది. వరంగల్‌లో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేసిన నేపథ్యంలో నిజామాబాద్‌లో విమానాశ్రయం అవసరం లేదనే అభిప్రాయంలో కేంద్ర ప్రభుత్వ వర్గాలు ఉన్నట్లుగా పలువురు చర్చించుకుంటున్నారు.




ఎయిర్‌పోర్టు నిర్మిస్తే 2024–25 సంవత్సరానికి గాను ఏటా 0.105 మిలియన్ల ప్రయాణికులు, 2054–55 సంవత్సరానికి గాను ఏటా 0.624 మిలియన్ల ప్రయాణికులు సేవలు పొందుతారని నివేదికలో వివరించారు. ఐదు గ్రామాల పరిధిలో 700 మంది పట్టాదారులకు చెందిన 802.37 ఎకరాలు, మరో 913 అసైన్డ్ పట్టాదారులకు సంబంధించిన 860.08 ఎకరాల్లో మొత్తం కలిపి 1613 మంది పట్టాదారులు, అసైన్డ్ పట్టాదారులకు సంబంధించిన 1663.05 ఎకరాల్లో సర్వే చేశారు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఉత్తర తెలంగాణ అభివృద్ధిని ఆకాంక్షిస్తూ విమాన రాకపోకల కోసం తీవ్రంగా శ్రమించారు. త్వరితగతిన ఈ ప్రాంతం అభివృద్ధి చెందడంతో పాటు గల్ఫ్‌కు వెళ్లి వచ్చే వారి సంఖ్య భారీగా ఉండడంతో జక్రాన్‌పల్లిలో ప్రతిపాదిత ఎయిర్‌పోర్ట్ అవసరమని కేసీఆర్ సర్కారు గుర్తించింది. కానిప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అంశాన్ని పట్టించుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వరంగల్ ఎయిర్‌పోర్టు ఘనత తమదే అన్నట్లుగా రేవంత్ రెడ్డి చెప్పుకుంటున్నారు. అయితే జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్టు ఏర్పాటుపై ఒక్క అడుగు ముందుకు పడకపోవడం ఎవరి ఘనత అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



ఎయిర్‌పోర్టు ఏర్పాటు ప్రతిపాదిత స్థలం

### పట్టించుకోని బీజేపీ ఎంపీలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీజేపీ ఎంపీలు లేరు. వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ స్థానాలకు కాంగ్రెస్ ఎంపీలు ఉన్నారు. అయినప్పటికీ గతంలో బీఆర్ఎస్ ఎంపీలు పోరాట ఫలితంగా మామునూర్ ఎయిర్‌పోర్టు సాధ్యమైంది. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్టు ఏర్పాటు కోసం బీఆర్ఎస్ ఎంపీలు తీవ్రంగా శ్రమించారు. ప్రస్తుతం నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గాల్లో 2019, 2024 రెండు పర్యాయాలు బీజేపీ ఎంపీలే గెలుపొందారు. ఇందులో ఒకరు కేంద్ర సహాయ మంత్రిగానూ ఉన్నారు. అయినప్పటికీ ఉత్తర తెలంగాణ అభివృద్ధికి కనీసం పట్టించుకోవడం లేదు. జక్రాన్‌పల్లిలో ఎయిర్‌పోర్టు ఏర్పాటైతే ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్‌తోపాటు మెదక్ జిల్లాకు సైతం లాభం చేకూరునున్నది. తెలంగాణలో 17 మంది లోక్‌సభ సభ్యులకు 8 మంది బీజేపీ ఎంపీలు, 8 మంది కాంగ్రెస్ ఎంపీలు ఉన్నా, రాష్ట్ర ప్రయోజనాలను పట్టించుకోకపోవడం గమనార్హం.

# ప్రజా సమస్యలు పట్టించుకోరా?




అందాల పోటీ కాదు.. ప్రజాధనం లూటీ

బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు జీవన్ రెడ్డి

ఆర్మూర్‌టౌన్, మే10: రాష్ట్రంలో ప్రజా సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రపంచ అందాల పోటీలతో తెలంగాణ రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్ డ్యామేజ్ అవుతున్నదని పేర్కొన్నారు. భారతీయ సంస్కృతికి మచ్చ తెచ్చేలా ఉన్న ప్రపంచ అందాల పోటీల నిర్వహణను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం మన దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నాకూడా రూ.2కోట్లకు పైగా ప్రజాధనాన్ని వృథాచేస్తున్నారని మండిపడ్డారు. విష సంస్కృతికి తెరదీసి రాష్ట్ర శ్రమైక్య జీవన సౌందర్యాన్ని అప్రతిష్ట పాలు చేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు. యుద్ధ మేఘాలు కమ్ముకొని దేశమంతటా ప్రమాద ఘంటికలు, సైరన్ మోతలు, విమానాశ్రయాల మూసివేతలు, విద్యుత్ సరాఫరా నిలిపివేతతో అల్లాడుతుంటే హైదరాబాద్‌లో అందాల ఆరబోతలేమిటని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న హత్యలు, లైంగిక దాడులను నిరోధించకుండా, విద్యా, వైద్యం, ఉద్యోగం,ఉపాధి, అవుట్ సోర్సింగ్ కార్మికులకు వేతనాలు,ఇండ్ల నిర్మాణం, పింఛన్లు తదితర అంశాలపై దృష్టి పెట్టకపోవడం దారుణమని పేర్కొన్నారు.

# ప్రైవేట్ దవాఖానలో నర్సు అనుమానాస్పద మృతి

### పోలీసులకు కుటుంబీకుల ఫిర్యాదు



శిల్ప (ఫైల్)

వినాయక్‌నగర్/ఖలీల్‌వాడి, మే 10: నిజామాబాద్ : జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ దవాఖానలో నర్సు అనుమానాస్పదస్థితిలో మృతిచెందింది. నర్సు మృతిపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తంచేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కామారెడ్డి జిల్లా డోంగ్లి మండలానికి చెందిన శిల్ప(27) కొంత కాలంగా దవాఖానలో పనిచేస్తున్నది. శుక్రవారం రాత్రి డ్యూటీలో ఉండగా.. శనివారం ఉదయం ఆమెను తోటి సిబ్బంది నిద్రలేపేందుకు ప్రయత్నించగా ఎంతకూ లేవలేదు. పరీక్షించిన దవాఖాన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించి, కుటుంబీకులకు సమాచారం అందించారు. శిల్ప మృతిపై కుటుంబీకులు అనుమానం వ్యక్తంచేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు దవాఖానకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి, ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతురాలి చెల్లి సూర్యవంశీ రాహు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో బి.రఘుపతి తెలిపారు. శుక్రవారం నైట్ డ్యూటీలో ఉన్న మిగతా సిబ్బందిని సైతం విచారించి, వారి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేస్తామని పేర్కొన్నారు.

# నగరంలో 2 కే రన్

### లూపస్ వ్యాధిపై అవగాహన




అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్యులు

ఖలీల్‌వాడి, మే 10: జిల్లా కేంద్రంలో ఐఎంఏ(ఇండియన్ మెడికల్ అసోసియేషన్), నిజామాబాద్ రుమటాలజీ అండ్ ఆర్థరైటిస్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ లూపస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ వినాయక్‌నగర్‌లోని హనుమాన్ జంక్షన్ నుంచి రుమటాలజీ అండ్ ఆర్థరైటిస్ సెంటర్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. శరీరంలోని కండ్లు, మెదడు, ఊపిరితిత్తులు, మూత్ర పిండాలు, రక్తనాళాలు ఏ భాగాన్ని అయినా లూపస వ్యాధి ప్రభావితం చేస్తుందని తెలిపారు. చర్మం నుంచి గుండె వరకు అన్ని అవయవాలపై దాడి చేస్తుందన్నారు. వ్యాధి సోకిన వారిలో జుట్టు ఎక్కువగా ఊడిపోతుందని, ఎండలోకి వెళ్లినప్పుడు వేడికి చెంపలపైన దద్దుర్లు, ఎలాంటి కారణం లేకుండా జ్వరం వచ్చిపోతూ కీళ్లు, తలనొప్పులు వస్తాయని వివరించారు. ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు, మంచి నిద్ర, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, యోగా వంటి ప్రక్రియలతో ఒత్తిడి తగ్గించుకొని, మంచి జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యురాలు గ్రీష్మ, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ అజ్జ శ్రీనివాస్, కోశాధికారి డాక్టర్ రాజేందర్, డాక్టర్ జీవన్‌రావు, డాక్టర్ రవికిరణ్, శ్రీశైలం, సీనియర్ వైద్యులు పీబీ.కృష్ణమూర్తి, డాక్టర్లు దామోదర్‌రావు, ద్వారకానాథ్, రవికిరణ్, గాంధీ, రాజేందర్ పాల్గొన్నారు.



# జీజీహెచ్‌పై 'రెడ్‌క్రాస్'



భారత్–పాకిస్థాన్ యుద్ధం నేపథ్యంలో రాష్ట్ర వైద్యారోగ్యశాఖ కీలక నిర్ణయం తీసుకున్నది. యుద్ధ సమయంలో దవాఖానలు లక్ష్యంగా మారకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వ దవాఖాన భవనాలపై పెద్ద సైజులో రెడ్‌క్రాస్ గుర్తులను పెయింట్ చేస్తున్నారు. ఇందులో భాగంగా నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ దవాఖాన భవనంపై 12 అడుగుల పొడవు, వెడల్పుతో రెడ్‌క్రాస్ గుర్తును పెయింట్ వేయించినట్లు వైద్యులు తెలిపారు.

–ఖలీల్‌వాడి, మే 10

# తగ్గుతున్న ఎస్సారెస్పీ నీటిమట్టం



మోర్తాడ్, మే 10: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం తగ్గుతున్నది. శుక్రవారం 11.23 టీఎంసీలుగా ఉన్న నీటిమట్టం శనివారానికి 11.125 టీఎంసీలకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు(80.5టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1060.60అడుగులు(11.125టీఎంసీలు) నీరు నిల్వ ఉన్నది. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు 100 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 359 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో వెళ్తున్నది.



బీబీపేట్ మండలం తుజాల్‌పూర్ గ్రామంలో ధర్నా చేస్తున్న రైతులు

జాప్యం చేస్తున్నారని రైతుల ఆగ్రహం

తుజాల్‌పూర్‌లో రోడ్డెక్కి ఆందోళన

# ధాన్యం కొనాలని ధర్నా

బీబీపేట్, మే 10 : ఉమ్మడి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో జాప్యం నెలకొంటున్నది. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి రోజులు గడుస్తున్నా కొన్ని కేంద్రాల్లో కాంటా చేయడంలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో కొనుగోలు ప్రక్రియ ముందుకు సాగడంలేదు. మరోవైపు అకాల వర్షాలు రైతులను ఆగమాగం చేస్తున్నాయి. కొనుగోలు కేంద్రాలు, కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోకుండా ఉండడానికి నానా పాట్లు పడుతున్నారు. ధాన్యం తీసుకువచ్చి కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు కాయాల్సి వస్తున్నది. ధాన్యం విక్రయించడానికి వచ్చిన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నా పట్టించుకునేవారే కరువయ్యారు.

కామారెడ్డి జిల్లా బీబీపేట మండలం తుజాల్‌పూర్‌లో ధాన్యం కొనుగోలు చేయాలంటూ అన్నదాతలు రోడ్డెక్కారు. ధాన్యం కొనుగోలు జాప్యాన్ని నిరసిస్తూ రైతులు శనివారం రోడ్డుపై బైఠాయించి, ధర్నా చేపట్టారు. వడ్లను కొనుగోలు చేయడంలో జాప్యం చేస్తున్నారని ఆరోపించారు.తరలించిన ధాన్యాన్ని రైస్‌మిల్లుల్లో వెంటనే అన్‌లోడింగ్ చేయడంలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారులు లారీలను అందుబాటులో ఉంచి, కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై ప్రభాకర్ ఘటనా స్థలానికి చేరుకొని రైతులను సముదాయించారు. రైతులను అధికారులతో మాట్లాడించి, ఆందోళనం విరమింపజేశారు.



ఇందల్వాయి మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న జేపీసీ నాయకులు, గ్రామస్తులు

# భారత్ మాతాకీ జై

ఇందల్వాయి, మే 10 : 'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా పాకిస్థాన్‌తో వీరోచితంగా పోరాడుతున్న భారత సైన్యానికి మద్దతుగా మండల కేంద్రంలో రాజకీయ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం కొవ్వొత్తులతో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం నుంచి గంగారాం తండా హనుమాన్ ఆలయం వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారతసైన్యానికి ప్రజలంతా అండగా నిలువాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రమేశ్‌నాయక్, అన్ని పార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.